# మాధురిక




తులసి చెట్టుముందర దీపారాధన చేస్తోంది. "ఏమ రదీ ? మాధురికా ?" అని, చాలా నాళ్ళకు వచ్చిన గోపాలం పిలచేప్పటికి, మాధురిక వెనక్కు తిరిగి చూసింది. అతను యింకేమీ మాటాడకుండా యింట్లోకి వెళ్లాడు. "వస్తున్నా వుండు—బాబాయ్" అంటూ, కాసేపు అక్కడనే కూర్చుని, ఏదో గొణుక్కునీ, చెంపలు వేసుకుని యింట్లోకి వెళ్లింది మాధురిక.

గోపాలం కోపం పెదవి దాటింది. అంతకు పూర్వం మాధురికమీద వున్న వాత్సల్యం అమాంతంగా మటుమాయమైంది. "నాకు యింతవరకూ తెలియనే తెలియదు. నేనెన్ని సార్లుచెప్పాను? వాళ్లు నీ నోటికి చిక్కంవేసి, ఆ ముసలిడొక్కుతో తాడు కట్టిస్తారని ? అప్పుడు నీవు ఏమాత్రం ఒప్పుకోవద్దనీ చెప్పలేదా?" ఆమాటకు మాధురిక యేమీ మాట్లాడనే లేదు, "నా ఖర్మం యిలా తగలడింది!" అని అంది.

"ఔను— పెద్దవాళ్లు లోకజ్ఞానం తెలిసీ, ఏమీ ఆలోచించటం లేదు !"

"ఏమిచేయను బాబాయి ? కదిలితే నలి-బిలిగా కొట్టేరు. పెళ్లి అయ్యేంతవరకూ, నన్ను సాధించటం తప్పనించి ఒక నాడయినా నన్ను సరిగా చూశారా?"

"ఇలా క్రుగ్గిపోతూ ఎన్ని నాళ్లు వుండగలవు?"

"నేను క్రుంగుతూన్నది వాస్తవమే. ఇదిగో, నాజీవితంలో—ప్రతిరోజూ సంఘటనలు—వ్రాశా. చూడు"! గోపాలం ఆపుస్తకం చూట్టం మొదలు పెట్టాడు. అందులో—

## ౧

"స్నేహితురాలు శారద పెళ్లి అవుతోంది. చుట్టుపక్కల వున్న పుణ్యాంగనలు చక్కని చీరలూ, జాకెట్లూ ధరించి వెళుతున్నారు. నేను అమ్మని అడిగాను: "నేనూ, వెళ్లనటే?" అని.

"ఇక, నీ కా భాగ్యం లేకుండా చేశాం తల్లీ, మళ్లీ వచ్చే జన్మకేను! వద్దు. పట్టినే పెళ్లి, నలుగురు ముత్తైదువులకి దూరంగా వుండు. అంతా, తమతమ యిండ్లకి బయల్దేరకముందటే, వీధిగుమ్మాన వచ్చేయి. ఊరు నోరు నొక్కుంటోం దిప్పటికే—నీకు 'శిరోముండనం' చేయించలేదని!" అంది అమ్మ.

ఆ కాస్తంత భాగ్యానికే, నా ఆనందం పట్టశక్యంకాకపోయింది. అమ్మ చెప్పిన విధులన్నిటినీ, జాగ్రత్తగా అనుసరిస్తూ, ఓమూల కూచున్నా ప్రియమయిన స్నేహితురాండ్ర నవ్వు ముఖాలు ఎన్ని చూసినా, నాకుమాత్రం నవ్వనేదే కలగలేదు.

"ఛీ! ఛీ! ఛీ! అది విధవకుంక! దానికి బొట్టు పెట్టకు!" అని ఒక గుసగుస వినపడ్డాది. నా హృదయంలో అపూర్వమయినట్టి బాధకలిగింది. అమ్మతో 'ఫలానివారి భార్య నన్నిలా అందే' అని చెప్పితే, అమ్మ తిరిగి నన్నే కేక వేస్తుంది. నేచెప్పలే వెళ్ళనే వద్దని. ఇంకా, వాళ్లు నిన్ను అన్నారని అనుకోటం మనది పొరబాటుగాని, వాళ్ళదేం లోపం" అంటుందనీ తెలును. ఈ వైధవ్యం అనుభవించే స్త్రీలని నలుగురూ నడుస్తున్న బాటమీద ఏమీ అనకూడదని తెలిసినా ముందటగా దుమ్మెత్తిపోయని వారెవరూ ? అలా బాలవితంతువులనుగా తయారుచేసింది ఎవరు ? మా వూళ్లో పెద్దలేనా, లేక భగవంతుడా ? అలా నాగురించి తెలియని పిల్ల, నా నొసటను కుంకుం పెడుతూంటే, నాకు సంఘ కట్టుబాటులు తెలిసే, వ్యతిరేకించా! ఇలాంటి సంఘటన యీ వూరులో అపూర్వము! అశ్వత్థమున్నా!! అందుకనే ఆ అమ్మాయి నావద్దకి వచ్చినపుడు, నే మాట్లాడలేదు! అసలు నా మనసొప్పలేదు. పురుషునికీ—స్త్రీకీ, యిలాంటి విశేషాలలో వ్యత్యాస్తా లెందుకుండాలె ?

## ౨

"అయింది, కాటికి కాళ్లు చాచిన వాడిని తెచ్చారు—అంటగట్టారు. ఊరికినే చేశారా యీ

పెళ్ళినీ? వాడు పోయిన మర్నాడు, వాడి దమ్మిడీ తన పెట్టెలో వేసుకుందామని చేసిన పని! మళ్ళీ తన యిష్టంవచ్చిన కుర్రగుంటడితో కులుకుదామని— చేసిన పనులు! రామ, రామ లోకం మరీ అధ్వాన్న దశలోకే వెళుతోందండీ?"

"ఎవరు, యీ స్వార్థానికి లోనయింది? సత్యం చెప్పే వారినే యిలా రమ్మనండి. పెండ్లి అయ్యేవరకూ, కటికి మంచినీళ్ళుకూడా త్రాగకుండా చేస్తూ "ఇవ్వవయ్యా! నీ పిల్లకే అదృష్టం దొర్లి వస్తోంది. నిత్యకల్యాణి. పచ్చగా వుంటాది-చేయి. ఆయనా చాలా మంచివాడేను. ఇవ్వు. పైగా, అలాటి పేరుమోసినవారికి మన పిల్లనిస్తమంటే, మనకే ఘనత వుంటాదిగాని, యివ్వు!" అని మాటాడారు పెద్దలు.

దురదృష్టవశాత్తూ భగవంతుడు నా కుంకుం చెరిపేడు. ఇప్పుడిలా మాట్లాడుతున్నారు. వారు పోయిన మర్నాటినుంచీ నిస్సారమైన భోజనం, సుఖంలేని మంచం, నవ్వు నవ్వ యెఱుగని ముహం— ముత్తైదువులను చూడని నాకళ్ళు యెందుకు కాల్పనా? పెద్దలంతా —సంఘ సంస్కర్తలట వాళ్ళెవరోను! —చేరి, "అమ్మాయీ! రేపు ఏకాదశీ, ఉపోష్యం వుండు" అని చెప్పిపోతున్నారు—ఒకటికి పదిసార్లు. మరి, నేను చిక్కి శల్యంలా ఎందుకవకుండా వుంటానా?

శక్తిలేక, మూఢాచారాల్లో కొంచమయినా నమ్మకం లేక తిండి తిందామని అనుకుంటాను; ఆ యుద్దేశ్యాన్ని యెవరికో చెపితే, ఆవిడ వెళ్ళినచోటికల్లా—నూయి, చెఱువు, గుడి, బజారు—యీ విషయాన్ని వెళ్ళగ్రక్కుతుంది.

"అయ్యో శ్రీరామచంద్రా! ఈముదనష్టం సంబంధము యెక్కడ తెచ్చాడో గాని, ఆయన కొంప మరీ నీచంపు కొంపయిందేం? మాధురిక, వుపోష్యం వుండదట, భానుమతమ్మా!" అంటూ గుసగుసలాడుకుని, నేనెక్కడ కనపడినా, నన్ను నిలబెట్టి ప్రశ్నించే దెవరూ?—లోటివాళ్ళేను.

3

కాపరంచేస్తున్నప్పటి విశేషం. ఊరిలోకి వచ్చి నన్ను చూతామని నా అన్నగారి కుమారుడు వస్తే, వాడిని అనుమానించారు. 'వారికి' లేనిపోని నేరాలు నూరి పోశారు. దానికి ప్రతిఫలంగా కరయిన తిండిలేక కూచుంటే—నిలబడమనీ, నిలబడి వుంటే— కూచోమనీ నన్ను నానా హింసలూ పెట్టించిన వాళ్ళకు కళ్ళు పోయినయి అనేందుకు ఎవరికయినా వాక్కు వుందా? మళ్ళా వారంతా షష్ఠిపూర్తుల వారూ, ప్రపంచ జ్ఞానం పూర్తిగా తెలిసినవారూ, సమస్త గంగల్లోనూ మునిగిన వారున్నూ!"

"ఇలాటివి చెప్పవలసివస్తే ఎన్నో లక్షలున్నాయి" అంది మాధురిక.

అప్పుడు నిర్వేదాన్ని అనుభవిస్తూన్న గోపాలం అన్నాడు. "మనకు ఆకాశంలో ఎవరో శత్రువులా గిట్టనివాళ్ళే అండాం—వుండి, మనకి యిలాటి అన్యాయాలూ, ద్రోహాలూ జరుపుతున్నారు అని అనుకుంటున్నాం—మాధురికా. ఆ ద్రోహాలూ, అన్యాయాలు చేసేవారూ మన మానవ సంఘంలోనే వున్నారు. వాళ్ళమీద జ్ఞానం తెలిసినవారున్నూ యెలాటిచర్య తీసుకోటంలేదు. అందుకనే వాళ్ళు మన నెత్తికెక్కుతున్నారు. నిర్దోషుల్ని యిష్టంవచ్చినట్లు హింసిస్తూన్నారు. నీలాటివారిని మరిన్ని!

"కుళ్ళు ఆశయాలూ, కుళ్ళు మతాచార మూఢ్యాలూ, ఒకరి నొకరు దోపిడీచేసుకోటం—ప్రస్తుతం పరిపాటయిపోయింది. చక్కని ఆశయాలతో వున్న వారిని నానా కష్టాల పరంపరలోనూ త్రోసేస్తూన్నారు" అన్నాడు.

మాధురికమాత్రం యింకా ఆదేస్థితిలోవుంది. ఆమెలోని అగ్నిజ్వాల చల్లారలేదు. ఆమెకే సంఘం మీద అధిక కోపం—నాకున్నూ.